క్లుప్తంగా

సీఎం కప్-2024 పోటీలకు ఆహ్వానం

కందుకూరు: గ్రామ, మండల స్థాయిల్లో సీఎం కప్-2024 క్రీడా పోటీలను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ గీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా పోటీలను ఈ నెల 7,8 తేదీల్లో గ్రామస్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనాలని గీత కోరారు. గ్రామస్థాయిలో అర్హత సాధించిన వారికి డిసెంబర్ 10 నుంచి 12వ వరకు మండల స్థాయిలో అర్హత పొందిన వారిని జిల్లా స్థాయికి పంపుతామన్నారు. ఆసక్తి గల వారు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్, గ్రామ పంచాయతీల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

మున్సిపల్ చైర్ పర్సన్ హేమలత



విజయోత్సవాల్లో చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వాణి

తుక్కుగూడ: తుక్కుగూడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని బాలజీనగర్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ వ్యాప్తంగా వీధులను శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలను తొలగించడం తదితర పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఏ.వాణి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు భావన, ఆర్.రాజు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పేరెంట్-టీచర్ మీటింగ్

మీర్‌పేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పేరెంట్-టీచర్ మీటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు సమావేశానికి హాజరై పిల్లల చదువుకు సంబంధించిన విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకోవడంతో పాటు ఇతర విషయాలపై చర్చించవచ్చని సూచించారు. ఇంటర్మీడియట్ విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 90 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు.

పాఠశాలలో సామగ్రి ధ్వంసం



ధ్వంసమైన భోజనశాల కిటికీ అద్దాలు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధి రావిర్యాల పాఠశాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా విధ్వంసాలకు పాలుపడుతున్నారు. పాఠశాల ఆవరణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో ఏదో ఒక బడి ఫర్నిచర్, కిటికీలు, తలుపులు, మురుగుదొడ్లను ధ్వసం చేస్తున్నారు. గురువారం రాత్రి జెడ్పీహెచ్ఎస్ భోజనశాల కిటికీ అద్దాలు, డోర్‌లాక్‌లను పగలగొట్టారు. పోలీసులు దృష్టి సారించి దుండగులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ, శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పూజలు చేశారు. శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నవ సమాజ దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వక్తలు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నియోజకవర్గం పరిధిలో రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని పేర్కొన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా, సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపర్చడంలో బాబా సాహెబ్ కనబర్చిన దార్శనికత మహోన్నతమైనదని కొనియాడారు. - సాక్షి, నెట్‌వర్క్



కందుకూరులో.. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో.. బీఆర్ఎస్ శ్రేణులు



మీర్‌పేట కూడలిలో..



మహేశ్వరం: గొల్లూరులో మాజీ సర్పంచ్ హరినాథ్ గౌడ్ తదితరులు



మహేశ్వరంలో.. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

10 నుంచి నిరవధిక సమ్మె

- విద్యాధికారికి సమ్మె నోటీసు అందజేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు



ఎంఈఓకు నోటీసు అందజేస్తున్న ఉద్యోగులు

కందుకూరు: సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆ ఉద్యోగులు శుక్రవారం కందుకూరు ఎంఈఓ నర్సింహకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు విజయలక్ష్మి, లావణ్య, వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. 15 ఏళ్లుగా వివిధ హోదాల్లో మండల విద్యా వనరుల కేంద్రంలో, ఎంఐఎస్‌లు ఆపరేటర్లు, మెసెంజర్, పాఠశాల సముదాయాల్లో సీఆర్పీలు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, కస్తూర్బా పాఠశాలల్లో ప్రత్యేక అధికారులు, సీఆర్టీలు, పీజీసీఆర్టీలు, ఏఎన్ఎం, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కుక్ కం హెల్పర్లుగా కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్నారన్నారు. చాలీ చాలని వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికీ సరైన వేతనం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నెరవేర్చే వరకు సమ్మె బాట పట్టనున్నామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు భవాని, సురేష్, సత్తయ్య, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో వ్యర్థాల పారబోత

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనదారులు



సర్వీస్ రోడ్డు పక్కన కాలువలో వ్యర్థాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి ఈ-సిటీ నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డులో దుర్వాసన వెదజల్లుతోంది. రహదారి పక్కన వర్షం నీరు పోవడానికి ఏర్పాటు చేసిన కాల్వలో గుర్తు తెలియని వ్యక్తులు.. కంపెనీల నుంచి వెలువడిన రసాయనాలు, వ్యర్థాలను రాత్రివేళలో డంప్ చేస్తున్నారు. వ్యర్థాలతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. కాలువలో వ్యర్థాలు పారబోయకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిట్టి చేతులు పెద్ద సాయం..

- లెప్రసీ నివారణకు రూ.5.17 లక్షల విరాళం అందజేత
- ఉదారత చాటుకున్న విద్యార్థులు



లెప్రసీ సొసైటీ ప్రాంతీయ ప్రతినిధికి చెక్ అందజేస్తున్న పాఠశాల చైర్మన్

బడంగ్‌పేట్: చిట్టి చేతులు సహృదయంతో ముందుకు వచ్చి అపన్నహస్తం అందించాయి. లెప్రసీ, ఎయిడ్స్ నివారణకు చేయిచేయి కలిపి సాయం అందజేశాయి. కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం తమ తల్లితండ్రుల సాయంతో, అధ్యాపకుల ప్రోత్సాహంతో రూ.5,17,519లను ఆ పాఠశాల చైర్మన్ కృష్ణారెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు మానవత విలువలు పాఠశాల దశనుంచే నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను అభినందించారు. అనంతరం విరాళం చెక్కును లెప్రసి సొసైటీ ప్రాంతీయ ప్రతినిధి అరుణ్‌కు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ డాక్టర్ గోదాలక్ష్మి, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, ఏఓ మధుసూదన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'చెత్త' డంపింగ్



మీర్‌పేట రైతుబజార్‌లోని ఖాళీ స్థలంలో డంప్ చేసిన చెత్త

- ఖాళీ స్థలాలు, ఆవాసాల మధ్య చెత్త పారబోత
- డంప్ చేసిన వ్యర్థాలకు నిప్పు పెడుతున్న వైనం
- పొగ, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికుల ఆవేదన

మీర్‌పేట: డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను స్థలం ఖాళీగా ఉందని నివాసాల మధ్య పారబోసి కాల్చేస్తున్నారు. దీంతో మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని రైతుబజార్ లోపల ఉన్న ఖాళీ స్థలం ప్రస్తుతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఓ వైపు సమీకృత వాణిజ్య సముదాయం పనులు ముందుకు సాగకపోగా, మరో పక్క కుర్మల్‌గూడలో నిర్మాణంలో ఉన్న డంపింగ్‌యార్డు పనులు పూర్తికాకపోవడంతో సేకరించిన చెత్తను ఇక్కడే డంప్ చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కార్పొరేషన్‌లోని చెత్తనంతా కొంత కాలంగా నాగోలులోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. సుదూర ప్రాంతానికి వెళ్లడం వల్ల సమయం వృథా అవుతుండడంతో కొంతమంది సేకరించిన చెత్తను మార్కెట్‌లో డంప్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

డంప్ చేసి నిప్పు పెట్టి..

చెత్తను డంప్ చేయడంతో పాటు కాలుస్తున్నారని, దీంతో తీవ్ర దుర్వాసన, పొగతో అవస్థలు పడుతున్నామని పక్కనే డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముండే వారు తెలిపారు. ఎవరూ పట్టించుకోకపోవడం, అడ్డు చెప్పేవారు లేకపోవడంతో కొన్ని నెలలుగా సిబ్బంది ఇక్కడే చెత్తను డంప్ చేసి ఆపై నిప్పుపెట్టి కాలుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి పెట్టి రైతుబజార్‌లోని ఖాళీ స్థలంలో చెత్తను డంప్ చేయకుండా సిబ్బందిని హెచ్చరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం కప్ టోర్నీని వినియోగించుకోండి

ఎంపీడీఓ సుజాత

కడ్తాల్: క్రీడా శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న చీఫ్ మినిస్టర్ కప్-2024 పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుజాత సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ సత్యనారాయణ, పీఈటీలతో ఆమె మాట్లాడారు. 7,8న గ్రామీణ స్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: 32 గ్రామ పంచాయతీలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంఈఓ చాంప్లా నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. 7, 8వ తేదీ రెండు రోజుల పాటు, ఖోఖో, కబడ్డీ, అండర్ 18 విభాగంలో వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లకు తలకొండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలఆవరణలో 10 నుంచి 13వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వం

- సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- ఎంఈఓ, ఎంపీడీఓలకు సమ్మె నోటీస్ అందజేసిన ఉద్యోగులు

కడ్తాల్: అధికారంలోకి వచ్చిన అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది గడిచినా తమను పట్టించుకోవడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ సత్యనారాయణకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 19,325 మందికి పైగా విద్యాభివృద్ధికి పాటు పడుతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు మినిమం టైమ్‌స్కేల్(ఎంటీఎస్) ప్రకటించడంతో పాటు ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని, పీటీఐలకు రూ.12 వేతనం ఇవ్వాలని స్పష్టంచేశారు. హామీలను అమలు చేసే వరకు 6,7,9 తేదీలలో నిరసన దీక్షలు చేపడుతామని, డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా, హక్కుల సాధనకై నిరవధిక సమ్మెకు దిగుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు శ్రీరాములు, మల్లేశ్, రవి, రమేశ్, కేజీబీవీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

- సకాలంలో రుణాలు చెల్లిస్తే మరింత మేలు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- డ్వాక్రా సంఘాలకు రూ.9 కోట్ల చెక్కు అందజేత

తలకొండపల్లి: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఎస్‌హెచ్‌జీ డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.9 కోట్ల 50 లక్షల 50 వేలను మార్కెట్ చైర్ పర్సన్ యాట గీతా, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలు తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా బ్యాంకులకు చెల్లిస్తే.. మరింత ప్రోత్సాహంతో బ్యాంక్‌లు మరిన్ని రుణాలు అందజేస్తాయని స్పష్టంచేశారు. డబ్బును పొదుపు చేయాలని, వృథాగా ఖర్చు చేయరాదని సూచించారు.

ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్

రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను మంజూరు చేశారని పేర్కొన్నారు. అందులో భాగంగానే కల్వకుర్తి మండలం ఖానాపూర్‌లో 25 ఎకరాల్లో, రూ.125 కోట్లతో నిర్మించనున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని, ఏడో గ్యారంటీ పథకంగా నియోజకవర్గ ప్రజలకు సాగునీరు అందించి, ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేస్తామని చెప్పారు. నియోజవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టంచేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని, రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శ్రీనివాసురెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అజీం, అంజయ్య గుప్తా, వెంకట్ రెడ్డి, నరేష్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట నర్సింహ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మల్లమ్మ, ఏపీఎం శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్, వివిధ మండలాల బ్యాంక్ మేనేజర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

మౌలిక వసతుల కల్పనకు నిధులు



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

తుర్కయంజాల్: మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పురపాలక సంఘం పరిధి 1,8, 13,15,17,19 వార్డుల్లో రూ.2 కోట్ల 64 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ హరిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.